క్లుప్తంగా

ఆలయంలో ఆషాఢమాస పూజలు



పూజలందుకున్న నల్లగంగమ్మ తల్లి

సంబేపల్లి : మండల కేంద్రంలోని శ్రీ దేవర రాయి నల్లగంగమ్మ ఆలయంలో ఆదివారం అర్చకులు ఆషాఢ మాస పూజలు నిర్వహించారు. ముందుగా ఆలయాన్ని వేపాకులతో ఆలయ ప్రాంగణమంతా శుద్ధి చేశారు. అర్చకులు అమ్మవారికి ప్రత్యేక పూజలు, అర్చకులు, అభిషేకాలు నిర్వహించారు. పెద్ద సంఖ్యలో భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు.

జిల్లాస్థాయి పోటీలలో విద్యార్థుల ప్రతిభ

నందలూరు : ప్రొద్దుటూరులో శనివారం నిర్వహించిన జిల్లాస్థాయి తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలలో నందలూరు విజ్‌డమ్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చూపారు. ఈ పోటీలలో మొత్తం 12 మంది విద్యార్థులు పాల్గొనగా వలిమి మనోజ్ఞ, సాయి, ఎస్ మహమ్మద్‌లు స్వర్ణ పతకాలు సాధించగా, కె.గగన దీపిక, వై.విశిష్ట దేవంక, డి.లేఖన, విష్ణున్‌లు కాంస్య పతకాలు, ఎస్.మౌలా, సాయి రూప, నిఖిల్, సాయి విష్ణున్, భువనేష్, డి.ఈశ్వర్‌లు రజక పతకాలు అందుకున్నారు. ప్రతిభ చాటిన విద్యార్థులను విజ్‌డమ్ పాఠశాల కరస్పాండెంట్ వలిని రాధ అభినందించారు. ఇలాగే రాష్ట్ర, జాతీయ స్థాయిలో పతకాలు సాధించాలని ఆమె సూచించారు. ఈ కార్యక్రమంలో తైక్వాండో, కరాటే సీనియర్ కోచ్ సుధాకర్ పాల్గొన్నారు.

స్నేహితుల ఆపన్నహస్తం

ఒంటిమిట్ట : పెద్దకొత్తపల్లి గ్రామ నివాసి కట్టా వెంకటసుబ్బయ్య ఈనెల 17వ తేదీ గుండపోటుతో మృతి చెందాడు. వీరి కుటుంబాన్ని ఆదుకోవాలని తన చిన్ననాటి స్నేహితులు తలంచి మృతుని భార్య తులసమ్మకు ఆదివారం రూ. 15 వేలు ఆర్థిక సహాయం అందజేశారు. భవిష్యత్తులో మరిన్ని సహాయ సహకారాలు అందిస్తామని ఆ కుటుంబానికి భరోసా కల్పించారు. కార్యక్రమంలో స్నేహితులు రవీంద్రారెడ్డి, హరినాథ్‌రెడ్డి, రాజేంద్ర, సురేష్, రాంబాబు, శైలజ, లత, అనిత తదితరులు పాల్గొన్నారు.

చలో విజయవాడను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న సోమ బాలాజీ

పుల్లంపేట : మండల కేంద్రంలోని ఎస్‌బీవీడీ సభా పాఠశాలలో ఆదివారం పద్మశాలీల సమావేశం నిర్వహించారు. ముఖ్య అతిథులుగా ఎస్‌బీవీడీ సభా పాఠశాల చైర్మన్ నూకల శ్రీరాముల అధ్యక్షతన సమావేశం జరిగింది. రైల్వేకోడూరు నియోజకవర్గ పద్మశాలీల సంఘం అధ్యక్షులుగా దొంతు శివయ్యను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. రాష్ట్ర పద్మశాలీల సంఘం చలో విజయవాడ కార్యక్రమానికి పిలుపునిచ్చిందని, కొన్ని రోజుల్లో కార్యక్రమ వివరాలు తెలుస్తాయని శ్రీరాములు చెప్పారు. కార్యక్రమాన్ని విజయవంతం చేసేందుకు ప్రతి పద్మశాలీ సోదరుడు సహకారం అందించాలని కోరారు. కార్యక్రమంలో డాక్టర్ చెలమయ్య, సోము బాలాజీ బాబు, నరేంద్ర, శ్రీనివాసులు, నారాయణ, రామకృష్ణ, శివ, సారధి, ఎల్లయ్య, నూకల రమణ, బాలకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

వాహనదారులు నియమాలు పాటించాలి

సుండుపల్లె : వాహనదారులు నియమ, నిబంధనలు తప్పక పాటించాలని లేనిపక్షంలో జరిమానాలు, శిక్షలకు గురికావాల్సి వస్తుందని సుండుపల్లె ఎస్ఐ ఎస్ఎంకె హుస్సేన్ తెలియజేశారు. ఆదివారం తిమ్మసముద్రం ఆంజనేయస్వామి ఆలయం వద్ద ఆయన వాహనాల తనిఖీ చేపట్టారు. రికార్డులు సరిగా లేని వాహనదారులకు జరిమానా విధించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనదారులు వాహన రికార్డులను తప్పనిసరిగా వాహనాలలో ఉంచుకోవాలని, హెల్మెట్ లేని ప్రయాణం ప్రమాదకరం, నేరమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా సామూహిక సత్యనారాయణ వ్రతం



వ్రత పూజల్లో పాల్గొన్న భక్తులు

రాజంపేట టౌన్ : పట్టణంలోని ఆంజనేయ స్వామి ఆలయంలో ఆదివారం సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతాన్ని ఘనంగా నిర్వహించారు. తొలుత ఆలయ ప్రధాన అర్చకులు హరిస్వామి సత్యనారాయణ స్వామి ప్రతిమను మండపంలో కొలువుదీర్చి విశేషంగా అలంకరించారు. అనంతరం పూజలు జరిపారు. స్వామివారి వ్రతాన్ని పురస్కరించుకొని భక్తులకు సత్యనారాయణ స్వామివ్రత కథను తెలియజేశారు.

ప్రకృతి సౌందర్యం



చిట్వేలి మండలంలోని రాపూరు రహదారిలో ఉన్న చెర్లోపల్లి వద్ద చెరువు నీటితో కొండల మధ్య ప్రకృతి కమనీయంగా చూపరులను కనువిందు చేస్తోంది. ఇలాంటి ప్రకృతి రమణీయ దృశ్యాలు చిట్వేలి మండలంలో ఎన్నో ఉన్నాయి. ఇలాంటి ప్రదేశాలలో ప్రభుత్వం పర్యాటకులకు ఏర్పాట్లు చేస్తే పర్యాటక ప్రాంతాలుగా అభివృద్ధి చెందుతాయి. – చిట్వేలి

వృక్ష సౌరంగం

స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల మీదుగా వత్తలూరుకు వెళ్ళే మార్గంలో పచ్చని వృక్షాలు వాహనదారులకు, ప్రజలకు ఆహ్లాదాన్ని కలిగిస్తున్నాయి. రోడ్డుకు ఇరువైపులా ఉన్న వృక్షాలు సొరంగంలా ఉండటంతో ఆ మార్గాన ప్రయాణించే వారికి కనువిందు చేస్తున్నాయి. ప్రస్తుతం వర్షాలు కురుస్తున్నందున అక్కడి చెట్లు మరింత పచ్చదనాన్ని సంతరించుకొని వాహనదారుల మనసును పులకింప చేస్తున్నాయి. వాహనదారులు ఈ మార్గాన చెట్ల కింద కొద్దిసేపు సేదతీరి పచ్చదనంతో ఏర్పడిన ప్రకృతిని ఆస్వాదిస్తున్నారు. - రాజంపేట టౌన్



మల్చింగ్ షీట్‌తో బహుళ ప్రయోజనాలు

- తక్కువ నీటితో పంట సాగు
- వేరు వ్యవస్థ అభివృద్ధి
- ఈ విధానంపై మక్కువ చూపుతున్న రైతులు



మండలంలో మల్చింగ్ పద్ధతిలో సాగుచేస్తున్న రైతులు

రైల్వేకోడూరు అర్బన్ : రైతులు పంట సాగు చేసిన ప్రతి సారి అతివృష్టి అనావృష్టి కారణంగా పంటలు దెబ్బతింటున్నాయి. ప్రస్తుతం రైతులు బొప్పాయి, అరటి, కూరగాయలు, దోస, మిరప తదితర పంటలకు మల్చింగ్ పద్ధతిలో బహుళ ప్రయోజనాలు పొందవచ్చని ఉద్యానశాఖ అధికారులు చెబుతున్నారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులలో మల్చింగ్ విధానం పలు రకాల పంటలకు ఉపయోగపడుతుంది. ఈ విధానంలో డ్రిప్ నీటి పారుదల ఉండడం వల్ల ఎక్కువ వర్షాలు వచ్చినా, తక్కువ వర్షాలు వచ్చినా మొక్కల పెరుగుదలకు ఎంతగానో ఉపయోగపడుతుంది. కొంతమంది రైతులు మల్చింగ్ విధానంపై ఆసక్తి చూపుతున్నారు. మరికొంత మంది రైతులు పాత పద్ధతిలోనే పంటలు సాగు చేస్తున్నారు. నియోజకవర్గంలోని కోడూరు, ఓబులవారిపల్లి, చిట్వేలి, పుల్లంపేట, పెనగలూరు మండలాలలోని గ్రామాలలో విస్తారంగా అన్ని రకాల పంటలు మల్చింగ్ షీట్ ద్వారా పంటలు పండించడానికి రైతులు ఆసక్తి చూపుతున్నారు. రైతులు మల్చింగ్ షీట్ ద్వారా వ్యవసాయం చేస్తే బహుళ ప్రయోజనాలు పొందవచ్చని అధికారులు తెలుపుతున్నారు.

మల్చింగ్ వల్ల కలిగే ప్రయోజనాలు..

చిన్న పంటలకు కూడా మల్చింగ్ ద్వారా పండిస్తే వర్షా భావ పరిస్థితులలో నీటిని ఆదా చేసుకోవచ్చు. మల్చింగ్ కింద డ్రిప్‌పైపు ఉండడం వల్ల మొక్కకు నీరు సమృద్ధిగా అందుతుంది. చెట్టు కింద భూమి పొడిగా ఉండి వేరు వ్యవస్థ ఆరోగ్యంగా పెరుగుతుంది. కలుపును నివారించవచ్చు. డ్రిప్ ద్వారా వేసిన ఎరువులు మొక్కలకు బాగా అందుతాయి. మల్చింగ్ వలన భారీ వర్షాలు పడినా తెగుళ్ల తక్కువగా వస్తాయి. పంట నాణ్యతతో పాటు దిగుబడి పెరుగుతుంది.

కలుపు బెడద ఉండదు



మల్చింగ్ షీట్ ద్వారా దోస, కర్బూజ పండిస్తున్నాను. రెండవ పంటగా బొప్పాయి, ఇప్పుడు అరటి, కర్బూజ రెండూ వేశాను. దీని వల్ల ముఖ్యంగా కలుపు బెడద లేకుండా పోవడంతో కూలీల భారం తగ్గుతుంది. తక్కువ నీటితో పంటను సాగు చేసుకోవచ్చు.

– కంభం వాసుదేవ రెడ్డి, రైతు, కోడూరు

రైతులకు ప్రయోజనం



మల్చింగ్ షీట్ ద్వారా పంటలు పండించడం వల్ల పంట నాణ్యతగా వస్తుంది. నీటి ఎద్దడి తట్టుకొని సాగు చేసుకోవచ్చు, వేరు వ్యవస్థ బాగుంటుంది. కలుపు తక్కువగా ఉండడం వల్ల తెగుళ్లు తక్కువగా ఉంటాయి. ఈ పద్ధతి వల్ల రైతులకు బహుళ ప్రయోజనాలు ఉంటాయి.

- వెంకట భాస్కర్, ఉద్యానశాఖ అధికారి, కోడూరు

విద్యారంగ పరిరక్షణకు దశలవారీ ఉద్యమం

రాయచోటి అర్బన్ : ప్రభుత్వ విద్యారంగాన్ని పరిరక్షించడం కోసం దశలవారీగా రాష్ట్ర ప్రభుత్వానికి వినతులు అందచేసే కార్యక్రమాలను విజయవంతం చేయాలని యూటీఎఫ్ జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు హరిప్రసాద్, షేక్ జాబీర్‌లు పిలుపునిచ్చారు. పట్టణంలోని అలీమాబాద్ ఉర్దూ ఉన్నత పాఠశాలలో యూటీఎఫ్ జిల్లా ఆఫీస్ బేరర్ల సమావేశం జరిగింది. వారు మాట్లాడుతూ ఈనెల 22 నుంచి 30వ తేదీ వరకు రాష్ట్ర, జిల్లాస్థాయి అధికారులకు, ఆగస్టు 5 నుంచి 15 వరకు ఎమ్మెల్యేలకు, 20 నుంచి 30 వరకు మంత్రులకు విజ్ఞాపన పత్రాలు అందిస్తామన్నారు. సెప్టెంబరులో ముఖ్యమంత్రికి 50వేల పోస్టు కార్డులు పంపే కార్యక్రమాన్ని నిర్వహిస్తామని చెప్పారు. కొత్త విద్యా సంవత్సరంలో ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య గణనీయంగా తగ్గిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రభుత్వ పాఠశాలల పరిరక్షణ కోసం జీఓ నం.117ను రద్దుచేసి 55 ప్రకారం ఉపాధ్యాయులను కేటాయించాలన్నారు. మున్సిపల్ స్కూళ్లలో పోస్టులను అప్‌గ్రేడ్ చేయాలని, బదిలీలు, ప్రమోషన్లను నిర్వహించాలని, పీఎఫ్ ఖాతాలను ప్రారంభించాలని, ఉపాధ్యాయులకు బోధనేతర పనుల నుంచి మినహాయింపు ఇవ్వాలంటూ వారు డిమాండ్ చేశారు.

విజయవంతమైన ఉచిత వైద్య శిబిరాలు



సిద్దవటం: వైద్య పరీక్షలు నిర్వహిస్తున్న వైద్యులు



పుల్లంపేట : అప్పారాజుపేటలో వైద్య శిబిరం దృశ్యం

సిద్దవటం : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ఆదివారం కడప కింగ్స్ ఆసుపత్రి వారు ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. 215 మందికి వైద్య పరీక్షలు చేసినట్టు నిర్వాహకులు తెలిపారు. శిబిరంలో పురిటిపిల్లలు, చిన్న పిల్లల వైద్య నిపుణులు డాక్టర్ హెచ్ఎస్ రుబీన, స్త్రీ, సంతాన సాఫల్య వైద్య నిపుణులు డాక్టర్ హెచ్.ఎస్.హజిర పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పిల్లలకు దగ్గు జలుబు, జ్వరం వంటి వైద్య పరీక్షలు నిర్వహిచామన్నారు. స్త్రీల సుఖ వ్యాధుల సమస్యలపై చాలా మంది పేషెంట్లు వచ్చరని వారి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను అందజేశామన్నారు. మహిళలకు నెలసరి వచ్చేటప్పుడు కడుపు నొప్పి ఎక్కువగా వస్తుందని సమస్యలు చెప్పారన్నారు. మహిళలు గర్భం దాల్చినప్పటి నుంచి తీసుకోవాల్సిన ఆహార జాగ్రత్తలను తెలియజేశామన్నారు. కార్యక్రమంలో ఆసుపత్రి మార్కెటింగ్ మేనేజర్ నవాజ్, ఏఓ విష్ణున్ష, ఫార్మసిస్టు ఎం.జయరాజు, సిబ్బంది పాల్గొన్నారు.

కంటి వైద్యశిబిరం విజయవంతం

చిన్నమండెం : మానవత స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో మండల కేంద్రంలో ఆదివారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. మండలం నుంచే కాకుండా పలు ప్రాంతాల నుండి పెద్ద ఎత్తున రోగులు కంటి వైద్యశిబిరానికి విచ్చేశారు. వచ్చిన రోగులకు మధురై అరవింద కంటి ఆసుపత్రి



చిన్నమండెం : కంటి పరీక్షలకు హాజరైన రోగులు

వైద్యులచే కంటి పరీక్షలను నిర్వహించారు. వచ్చిన రోగులలో 38 మందిని శస్త్రచికిత్సలకు ఎంపిక చేశారు. సంస్థ సభ్యులు అన్ని ఏర్పాట్లను పర్యవేక్షించారు.

అప్పారాజుపేటలో..

పుల్లంపేట : మండలంలోని అప్పారాజుపేటలో ఆదివారం తిరుపతిలోని శ్రీ రమాదేవీ మల్టీ సూపర్ స్పెషాల్టీ ఆసుపత్రి వారు డాక్టర్ రూపాశరణ్య ఆధ్వర్యంలో ఉచిత మెగా వైద్య శిబిరం నిర్వహించారు. ఈ మెగా వైద్య శిబిరంలో పెద్దఎత్తున ప్రజలు పాల్గొని వైద్య పరీక్షలు చేయించుకొని ఉచితంగా మందులు పొందారు. దీర్ఘకాలికంగా బాధపడుతున్న 15 మందికి తిరుపతికి రెఫర్ చేశారు. ఉచితంగా ఆపరేషన్ చేయిస్తామని వైద్యులు తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ మనోజ్ చంద్ర, పీఆర్‌ఓ మణి, పెంచలయ్య, అప్పారాజుపేట ఉప సర్పంచ్ ముస్తాక్, రిజ్వాన్, తదితరులు పాల్గొన్నారు.

సమష్టి కృషితో పార్టీని బలోపేతం చేసుకుందాం

- పార్టీ కార్యకర్తలు, అభిమానులకు అండగా అంటాం
- మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిలు



గాలివీడు: కార్యకర్తల సమావేశంలో మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యేలు శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డిలు

గాలివీడు : సమష్టి కృషితో వైఎస్సార్‌సీపీని బలోపేతం చేసుకుందామని మాజీ ఎమ్మెల్యేలు గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ఆర్.రమేష్‌కుమార్‌రెడ్డిలు కార్యకర్తలకు తెలియజేశారు. ఆదివారం మండలంలోని నూలివీడు గ్రామంలో మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి స్వగృహంలో ఏర్పాటు చేసిన గాలివీడు మండల వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, నాయకులు, అభిమానుల ఆత్మీయ సమావేశంలో మాజీ ఎమ్మెల్యే రమేష్ కుమార్‌రెడ్డితో కలిసి శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. వైఎస్సార్ సీపీని బలోపేతం చేయడానికి కార్యకర్తలు, నాయకులకు అండగా ఉండేందుకు గ్రామాలవారీగా కార్యకర్తలు, నాయకులతో శ్రీకాంత్‌రెడ్డి, రమేష్‌కుమార్‌రెడ్డిలు చర్చించారు. ఈ సందర్భంగా పలు అంశాలను నేతల దృష్టికి నాయకులు, కార్యకర్తలు తీసుకువచ్చారు. అధికార పార్టీ ఆగడాలను ధైర్యంగా అడ్డుకుందామని భరోసా కల్పించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్‌రెడ్డి మాట్లాడుతూ గత ఐదేళ్ల జగన్ పాలనలో వేలాది మందికి ఇళ్ల పట్టాలు, పక్కా గృహాలు, పేదలకు అసైన్‌మెంట్ పట్టాలు, 20 సంవత్సరాల హక్కు పత్రాలు, చుక్కల భూముల సమస్యలను పరిష్కరించామన్నారు. వెలిగల్లు ప్రాజెక్టు పూర్తిస్థాయిలో నిండిన సందర్భాలలో పలుమార్లు గేట్లు ఎత్తి దిగువ ప్రాంతాలకు నీటిని విడుదల చేశామన్నారు. కరువులో వెలిగల్లు కాలువ ద్వారా నీటిని ఇవ్వడంలో కానీ, గండికోట నుంచి వెలిగల్లు ప్రాజెక్టుకు నీళ్లు తీసుకువచ్చే పనులన్నీ మన ప్రభుత్వ హయాంలో మొదలయ్యాయని ఆయన గుర్తు చేశారు. గాలివీడు పట్టణానికి వెలిగల్లు నుంచి తాగునీటిని, వెలిగల్లు, తూముకుంట గ్రామాలకు ఇంటింటికి తాగునీటి పథకాలు, నూలివీడు వరకు పలు గ్రామాలలో వెలిగల్లు నీటి పథకాల ద్వారా తాగునీటి పథకాలను ఏర్పాటు చేసింది తానే అని గుర్తు చేశారు. గాలివీడు పట్టణంలో నాలుగు వరుసల రహదారి ఏర్పాటు అందులో డివైడర్లు ఏర్పాట్లు చేసి సుందరంగా అభివృద్ధి చేశామన్నారు. ప్రభుత్వ జూనియర్ కళాశాల మంజూరు విషయంలో కానీ, గ్రామాలలో సిమెంటు రోడ్లు తదితర మౌలిక వసతులు కల్పించామన్నారు. పారదర్శకంగా, అవినీతి రహితంగా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందిచామని ఆయన ప్రజలకు గుర్తు చేశారు. భవిష్యత్‌లో పార్టీని అన్ని రకాలుగా ఐకమత్యంతో బలోపేతం చేసుకుంటామని శ్రీకాంత్‌రెడ్డి తెలిపారు. రమేష్‌కుమార్‌రెడ్డి మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేద్దామని చెప్పారు. కార్యకర్తలకు పార్టీ అన్ని విధాల అండగా ఉంటుందని తెలియజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ జల్లా సుదర్శన్‌రెడ్డి, మండల కన్వీనర్ మిట్టపల్లి యదుభూషన్‌రెడ్డి, మాజీ మార్కెట్ కమిటీ వైస్ చైర్మన్ ఆవుల నాగభూషన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ గాలి శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ బండి చిన్నరెడ్డి, మాజీ వైస్ ఎంపీపీ రమేష్‌రెడ్డి, సర్పంచ్‌లు కామసాని చెన్నకేశవరెడ్డి, జానకి రామాంజులురెడ్డి, దేరంగుల నారాయణ, క్రిష్ణారెడ్డి, ఎంపీటీసీలు గడ్డం చంద్రప్రకాష్‌రెడ్డి, అమానుల్లా, షన్వాజ్, చిన్నరెడ్డి, శ్రీనివాసులు, అరుణ, వైఎస్సార్‌సీపీ వివిధ విభాగాలకు చెందిన నాయకులు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు.

నీలకంఠ్రావుపేట దర్గాలో గురుపౌర్ణమి పూజల్లో శ్రీకాంత్‌రెడ్డి

రామాపురం : అజ్ఞానమనే చీకటిని తొలగించే శక్తి గురువుని వైఎస్సార్‌సీపీ అన్నమయ్య జిల్లా అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్‌రెడ్డి అన్నారు. గురుపౌర్ణమి సందర్భంగా మండలంలోని నీలకంఠ్రావుపేట దర్గాలో షిర్డీ సాయి ఆలయంలోను, సద్గురు దర్గా స్వామిజీ సద్గురు దర్గా మాతాజీల మహా సమాధుల వద్ద నిర్వహించిన ప్రత్యేక పూజల్లో శ్రీకాంత్‌రెడ్డి పాల్గొన్నారు. దర్గా నిర్వాహకులు తీర్థ ప్రసాదాలు అందించి దుస్సాలువతో సత్కరించారు. సమాజ ఉన్నతికి నిత్యం త్యాగం చేసే గురువులకు వందనాలు తెలియజేస్తూ, జిల్లా ప్రజలకు శ్రీకాంత్‌రెడ్డి గురుపౌర్ణమి శుభాకాంక్షలు తెలియజేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అయూబ్, సిరాజ్, సహదేవరెడ్డి, ఇంతియాజ్, జాఫర్, దర్బార్, రియాజ్, ఆంజనేయులు, కొండయ్య, శ్రీనివాసులు, ఖాజా ,ఇలియాజ్ తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు

- సాయినాథుని ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పూజల్లో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, నాయకులు
- ఆలయ కమిటీల ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాలు



సిద్దవటం : భక్తులకు భోజనం వడ్డిస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి అమరనాథరెడ్డి, నాయకులు



రైల్వేకోడూరు అర్బన్ : పూజలు నిర్వహిస్తున్న మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు

పుల్లంపేట : మండల కేంద్రంలోని బొంబాయి స్వామి ఆశ్రమం, సాయిబాబా ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. వేకువ జాము నుంచి ఆలయాలు సుందరంగా ముస్తాబు చేశారు. భక్తులు పెద్దఎత్తున సాయిబాబా, బొంబాయి స్వాములను దర్శించుకున్నారు. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు.

ఘనంగా వ్యాస పౌర్ణమి

రైల్వేకోడూర్ అర్బన్ : పట్టణంలోని అభయాంజనేయ స్వామి దేవస్థానంలో ఆదివారం హిందూ సంఘాల ఆధ్వర్యంలో వ్యాసపౌర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. భక్తులకు వ్యాసపౌర్ణిమ స్తోత్రాలు, గీతాలు, దేవతలు, మహర్షుల గురించి వివరించారు. భక్తులకు తీర్థ ప్రసాదాలు పంపిణీ చేశారు.

ప్రత్యేక పూజల్లో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల

పట్టణంలోని సద్గురు సాయిబాబా ఆలయాలలో గురుపౌర్ణమి పర్వదినాన్ని పురస్కరించుకొని ఆదివారం భక్తులు పెద్ద ఎత్తున పూజలు నిర్వహించారు. పట్టణంలోని తిరుపతి రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయంలో మాజీ ఎమ్మెల్యే కొరముట్ల శ్రీనివాసులు ప్రత్యేక పూజలు చేశారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ధ్వజారెడ్డి, పంజం సుకుమార్‌రెడ్డి, ఉప సర్పంచ్ శివ సాయి, సీహెచ్ రమేష్, గునిశెట్టి రమేష్, నందాబాలా, నాయకులు, భక్తులు పాల్గొన్నారు.

వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో గురు పూజోత్సవం

కోడూరు పట్టణంలోని స్థానిక అమ్మవారిశాలలో వాసవీక్లబ్ అధ్యక్షుడు తిరుమలకుమార్ ఆధ్వర్యంలో ఆదివారం గురుపూజోత్సం నిర్వహించారు. అమ్మవారిశాల ప్రధాన అర్చకులు శరవణకుమార్‌కు పాద సేవ చేసి సన్మానించారు. అలాగే కామిశెట్టి చక్రవర్తి సహకారంతో అమృత కళశంపథకం ద్వారా 13 మంది పేద వైశ్యులకు నెలకు సరిపడ సరుకులను ఉచితంగా అందచేశారు.

సిద్దవటం : మండలంలోని ఏపీఎస్పీ 11వ బెటాలియన్ ఎదురుగా వెలసిన శ్రీ షిర్డీసాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఆలయ నిర్వాహకులు ఆవులరెడ్డి ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ వేడుకలకు రాజంపేట ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి హాజరై స్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం ఆయన భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు.

నందలూరు : మండలంలోని కడప – చెన్నై జాతీయ రహదారి కన్యకా చెరువుకట్టపై వెలసిన సాయిబాబా ఆలయంలో ఆదివారం గురుపౌర్ణమి వేడుకలను ఆలయ కమిటీ నిర్వాహకులు ఘనంగా నిర్వహించారు. స్వామివారి మండపాన్ని ప్రత్యేక పూలతో అలంకరించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారికి మొక్కులు తీర్చుకున్నారు.

రాజంపేట రూరల్ : మండల పరిధిలో గురు పౌర్ణమి వేడుకలను కమిటీ నిర్వాహకులు అత్యంత వేడుకగా ఆదివారం నిర్వహించుకున్నారు. మండలంలోని పలు సాయి మందిరాలను శోభాయమానంగా అలంకరించారు. స్వామి వారికి ఉదయం అభిషేకాలు చేసిన అనంతరం రాత్రి వరకు ప్రత్యేక పూజలు చేపట్టారు. అదే విధంగా భక్తులకు అన్న ప్రసాద వితరణ చేశారు. అలానే మండల పరిధిలోని ఆకేపాటి ఎస్టేట్ వద్ద ఉన్న దేవాలయాల సముదాయంలోని సాయినాథుని ఆలయంలో ఎమ్మెల్యే ఆకేపాటి, ఆయన సోదరుడు ఆకేపాటి అనిల్‌మార్‌రెడ్డిలు ప్రత్యేక పూజలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం అల్పాహారం, మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. గుండ్లూరు వద్ద బహుదానది తీరం వద్ద ఉన్న సాయినాథునికి ఆలయ వ్యవస్థాపక అధ్యక్షులు, ఆలయ చైర్మన్ రామకృష్ణానందస్వామిజీ ఆధ్వర్యంలో విశేషంగా పూజలు నిర్వహించారు. పట్టణ శివార్లలోని కూచివారిపల్లి వద్ద ఉన్న సాయినాథుని ఆలయంలో గురుపౌర్ణమి వేడుకలను భక్తి శ్రద్ధలతో జరిపారు. కాగా మండలంలో అటవీ ప్రాంతమైన ఎస్ఆర్ పాళెంలో వెలసివున్న శ్రీ వీరాంజనేయస్వామికి వైభవంగా గురుపౌర్ణమి వేడుకలు నిర్వహించారు. అన్నదాన కార్యక్రమం నిర్విరామంగా కొనసాగింది. అధిక సంఖ్యలో భక్తులు పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు.

రాయచోటి టౌన్ : గురుపౌర్ణమి సందర్భంగా రాయచోటి శ్రీ షిరిడీ సాయిబాబా మందిరంలో శ్రీ షిరిడీ సాయిబాబాకు ప్రత్యేకంగా అభిషేకాలు, పూజలు నిర్వహించారు. ఆదివారం మందిర ఆవరణలో హోమాలు, యజ్ఞాలు, పూజలు నిర్వహించారు. సాయినాథుడిని దర్శించుకున్న భక్తులకు తీర్థప్రసాదాలు, అన్నప్రసాదాలు పంచిపెట్టారు. పాత రాయచోటి అగస్తేశ్వర స్వామి ఆలయంలో గురుపౌర్ణమి సందర్భంగా ప్రత్యేక పూజలు అభిషేకాలు నిర్వహించారు.

రామాపురం : దర్బారు సాయినాథుడి మందిరంలో సద్గురు దర్గాస్వామిజీ, దర్గామాతాజీ మహాసమాధులకు పూలమాలలు వేసి పూజలలో కమలాపురం మాజీ ఎమ్మెల్యే రవీంద్రనాథరెడ్డి పాల్గొన్నారు. దర్బారు సాయి భక్తులు తీర్థప్రసాదాలు అందించారు.



పుల్లంపేట : ప్రత్యేక అలంకారంలో దర్శనమిస్తున్న బొంబాయి స్వామి

పెనగలూరు : మండల కేంద్రమైన పెనగలూరు సాయిబాబా ఆలయంలో ఆదివారం భక్తి శ్రద్ధలతో గురుపౌర్ణమి వేడుకలను నిర్వహించారు. పూజల్లో పాల్గొన్న భక్తులకు అన్నదానం ఏర్పాటు చేశారు.

సాయిబాబాకు ప్రత్యేక పూజలు

వీరబల్లె : మండల కేంద్రం సమీపంలో ఉన్న సాయిబాబా గుడిలో సాయిబాబాకు ఆదివారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. చుట్టుపక్కల గ్రామాల నుంచి భక్తులు, ప్రజలు విరివిగా పాల్గొని స్వామివారిని దర్శించుకొని పూజలు చేశారు.